ట్రాఫిక్ సిగ్నల్‌లు ఏర్పాటు చేయండి



ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న సంక్షేమ సంఘం నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌లో బుధవారం నార్సింగి ట్రాఫిక్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై రాజేశ్‌గౌడ్‌లు పర్యటించారు. ఈ నేపథ్యంలో ప్రతి రోజు అలకాపూర్ చింతచెట్టు చౌరస్తా వద్ద విపరీతంగా ట్రాఫిక్ పెరిగిపోతుందని, రోడ్డు ఇరువైపులా ట్రాఫిక్ సిగ్నల్‌లను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు ట్రాఫిక్ పోలీసులను కోరారు. దీంతో అక్కడ రోడ్డును రెండు వైపులా మూసి, కొద్ది దూరం తర్వాత యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. దీంతో కొంత ట్రాఫిక్ జామ్‌లు తగ్గుతాయని సీఐ పేర్కొన్నారు. ఇలాంటి డివైడర్‌లను ఏర్పాటు చేసి రోడ్లను మూసే బదులుగా ట్రాఫిక్ సిగ్నల్‌లు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన షాపులు, నిర్మాణాలను కూల్చివేయాలని స్థానికులు కోరారు. ఇదే తరహా నార్సింగి సర్కిల్‌లోను సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

బోనాలు, చెరువు సుందరీకరణపై సమావేశం



మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: బోనాల పండుగను పురస్కరించుకుని ప్రజలంతా ఘనంగా పండుగను జరుపుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్‌లోని కట్ట మైసమ్మ దేవాలయంలో బోనాల పండుగ, ఎర్రకుంట కట్ట సుందరీకరణపై గ్రామ పెద్దలతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బోనాల కమిటీ నూతన చైర్మన్‌గా చేవెళ్ల యాదిరెడ్డి, వైస్ చైర్మన్‌గా మాజీ ఎంపీటీసీ సంతోష్‌ముదిరాజ్‌లను ఎన్నుకున్నారు. డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ నేపథ్యంలో దేవాలయాల వద్ద అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామన్నారు. గుంతలు గుంతలుగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లను వేయిస్తున్నామన్నారు. డ్రైనేజీలు పొంగిపొర్లకుండా ముందస్తుగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. ఎర్రకుంట కట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులను శరవేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదర్షాకోట్ గ్రామంలోని పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం శ్రీ శారదాధామంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం ఘనంగా జరిగింది. 1997–98 సంవత్సరంలో చదివి స్థిరపడిన పూర్వ విద్యార్థులు మళ్లీ కలిశారు. ఈ కార్యక్రమానికి విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. విద్యా రంగంలో అనేక సంస్థలు పని చేస్తున్నప్పటికీ సరస్వతీ విద్యాపీఠం కూడా విద్యా రంగంలో దేశవ్యాప్తంగా సమాజంలో విలువలు పెంపొందించడానికి కృషి చేస్తున్నాయన్నారు. పూర్వ విద్యార్థులు పాఠశాల కమిటీలలో అభివృద్ధికి, శిశు మందిరాల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆవాస విద్యాలయ పూర్వ విద్యార్థులు తమ ఆచార్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు అయిన ప్రతీ ఒక్కరూ పాల్గొన్నారు. ఇందులో ఇద్దరు పూర్వ విద్యార్థులు లండన్ నుంచి కూడా వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్, ఆవాస విద్యాలయం కార్యదర్శి బొద్దు శ్రీనివాస్, పూర్వ చార్యులు తిరువెంగళాచారి, మాదారపు రామచంద్రారావు, పూజారి గోపాలకృష్ణ, నిర్మలాజ్యోతి, పూర్వ విద్యార్థులు, రాఘవేంద్ర క్లీనిక్ అధినేత డాక్టర్ వెంకటరాఘవ, శిరీషా పాల్గొన్నారు.



ఆచార్యులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

‘కేంద్రం నిర్లక్ష్యంతోనే గిరిజనులపై దాడులు’



సమావేశంలో మాట్లాడుతున్న రమావత్ అంజయ్య నాయక్

రాజేంద్రనగర్: దేశంలో గిరిజన చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని దేవరాజ్‌భవన్‌లో బుధవారం తెలంగాణ గిరిజన సమైక్య రంగారెడ్డి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని ఎ.రాజు నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజయ్య నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ గిరిజనులు నేటికీ అభివృద్ధికి దూరంగా ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, కౌన్సిలర్ హరిసింగ్ నాయక్ మాట్లాడారు.

నూతన కార్యవర్గం..

అధ్యక్షుడిగా రాజు నాయక్, ప్రధాన కార్యదర్శిగా జర్పుల శివ నాయక్ (ప్రచండ), ఉపాధ్యక్షులుగా జి.శంకర్ నాయక్, సహయ కార్యదర్శిగా బి.భిక్షు నాయక్, కోశాధికారిగా ఛత్రు నాయక్, సభ్యులుగా మోతీరామ్ నాయక్, సుధాకర్, రాములు, శంకర్ నాయక్, లోక్యా నాయక్, బాలు నాయక్, శక్రు నాయక్, లింగా నాయక్, రాజు నాయక్, లింగా నాయక్, రాజు నాయక్, రమేశ్ నాయక్, కిషన్ నాయక్, సరిలాల్ నాయక్, రమేశ్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రధాన రోడ్డులో చిమ్మచీకట్లు.!



రాయదుర్గంలోని ప్రధాన రహదారిలో ..

రాయదుర్గం: అది పాత ముంబాయి రహదారి నుంచి రాయదుర్గం లోపలికి వెళ్లే ప్రధాన రహదారి. కానీ మూడు రోజులుగా చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ముఖ్యంగా వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. జీహెచ్‌ఎంసీలో వీధిదీపాల ఫిర్యాదును ఆన్‌లైన్‌లో చేయాల్సిన పరిస్థితి రావడంతో ఎవరూ చేయలేకపోతున్నారు. ఒకవేళ చేసినా వెంటనే స్పందించలేని పరిస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాల వంటి అత్యవసరమైన వాటిని ఫిర్యాదు ఫోన్ ద్వారా అధికారుల దృష్టికి తెచ్చినా వీధిదీపాలు మరమ్మతులు చేసే పరిస్థితిని తిరిగి పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆషాఢమాసం, వర్షాకాలం కావడంతో ప్రధాన రోడ్డులో ఇలాంటి పరిస్థితి నెలకొనడం పట్ల పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే వీధి దీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అరగంట దంచికొట్టింది.!





లింగంపల్లిలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. అరగంట పాటు భారీ వర్షం కురవడంతో అంతర్గత, ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. కానీ లింగంపల్లిలోని అండర్ బ్రిడ్జి వద్ద అంతగా నీటి నిల్వ ఉండకపోవడంతో వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్య తలెత్తలేదు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు – శేరిలింగంపల్లి



కేబీదొడ్డి వద్ద నీరు లేక వెలవెలబోతున్న ఈసీవాగు

చినుకు చింత!

ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలైనా కానరాని వర్షం

- ఆందోళనలో రైతన్నలు
- వర్షం కోసం ఎదురుచూపులు

శంషాబాద్ రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు రెండు నెలలు కావస్తున్నా మండలంలో ఆశించిన వర్షాలు కురవలేదు. దీంతో వరి సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బోర్ల కింద వరి సాగు చేయడానికి రైతులు చాలా మంది నారుమడులు సిద్ధం చేసుకున్నారు. ప్రతి ఏటా ఈ సమయానికి వరినాట్లు పూర్తవుతాయి. కానీ ప్రస్తుతం రైతులు ఆకాశంలో చినుకు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వానలు కురవకపోవడంతో రైతులు తూకాలు ఆలస్యంగా పోశారు. వర్షాలు మరింత ఆలస్యం కావడంతో నాట్లు వేసేందుకు అనుకూలమైన పరిస్థితులు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెలవెలబోతున్న వాగులు..

వర్షాలు లేక వాగులు వెలవెలబోతున్నాయి. మండలంలో ప్రధాన నీటి వనరులుగా ఉన్న ఈసీ, ఎంటేరువాగుల్లో ఇప్పటి వరకు చిన్నపాటి వరద కూడా రాలేదు. బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోకి వరదనీరు చేరలేదు. రోజు రోజుకు బోర్లలో నీటి మట్టాలు తగ్గిపోతున్నాయి. దీంతో వరిసాగుకు కరిగేట్లు కాకపోవడం వరినార్లు ముదిరి కాలం గడిచిపోతుంది.

దిగుబడిపై ప్రభావం..

వరి సాగుకు జూలై, ఆగస్టు నెలలు అత్యంత కీలకంగా చెప్పవచ్చు. ఆగస్టు రెండో వారం లోపు వరి నాట్లు పూర్తి చేస్తే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. అయితే ఓ వైపు నార్లు ముదిరిపోతుండడం.. మరో వైపు వర్షాలు సరిగా కురువక వరిసాగు ముందుకు సాగడంలేదు. ఇప్పటి వరకు మండలంలో లోటు వర్షపాతం నమోదైయింది. ఈ నెల చివరి వరకు కురిసే వర్షాలు ఈ ఖరీఫ్‌కు కీలక ఆధారం కావడంతో రైతుల చూపులు ఆకాశంవైపే చూస్తున్నాయి.



సుల్తాన్‌పల్లి వద్ద రైతులు సిద్ధం చేసుకున్న వరి నారుమడి

ఘన సన్మానం



బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియమితులైయ్యారు. ఈ సందర్భంగా మాజీ చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు రంజిత్‌రెడ్డి ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్ తదితరులున్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ బుధవారం కలిశారు. శేరిలింగంపల్లి నియోజకర్గంలోని వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ మజహరుల్లా

గోల్కొండ: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా అన్నారు. సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే అవి ప్రమాదకరంగా మారి ప్రాణాలు కూడా బలిగొంటాయని ఆయన అన్నారు. దగ్గు, జ్వరం, ఒంటి నొప్పులతో పాటు ఇతర రకాలైన వ్యాధులు ఉన్న వారు వెంటనే తమ వద్దకు వస్తే అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. అవసరమైన వారికి రోగనిర్ధారణ పరీక్షలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా తమ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషంట్ల సంఖ్య పెరుగుతుందని ఆయన తెలిపారు. ఆసుపత్రి ఫార్మసీలో మందుల కొరత లేదన్నారు. 24 గంటలు పని చేసే ఐసీయూ విభాగం కూడా ఉందని ఆయన అన్నారు.

మజ్లిస్ సెక్యులర్ పార్టీ

గోల్కొండ: మజ్లిస్ సెక్యులర్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండే ఏకైక పార్టీ అని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మెదక్ జిల్లాకు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం ఆయనను కలిశారు. మెదక్‌లో జరిగిన ఘర్షణల సందర్భంగా అరెస్టు అయిన మజ్లిస్ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి బెయిల్ ఇప్పించేందుకు సహాయ పడిన ఎంపీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో మజ్లిస్ నాయకులు

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు



భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీవేణుగోపాలస్వామి

మణికొండ: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో శ్రీ మహావిష్ణువు అవతార దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. హిందువుల పండగలో మొదటిదిగా శ్రీ మహావిష్ణువు పాలకడలిలో శేషయ్యపై యోగ నిద్రకు ఉపక్రమించే రోజు కావడంతోపాటు ఈ ఏకాదశి రోజున భక్తులు తెల్లవారుజాము నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మణికొండ మున్సిపాలిటీ పంచవటి కాలనీలో రామాలయం, పుప్పాలగూడ గోల్డన్ టెంపుల్, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, మంచిరేవుల శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాలకు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం



పార్కును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరేందర్‌గౌడ్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ చింతకుంట పార్కులో ప్రహారిగోడ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నరేందర్ గౌడ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో చింతకుంట పార్క్‌లో పరిస్థితిని తెలుసుకోవడానికి జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నరేందర్ గౌడ్, ఏఈ మూర్తితో పాటు బీజేపి నాయకులు కొమురయ్య తదితరులు పర్యటనలో పాల్గొన్నారు. ప్రహారిగోడ నిర్మాణానికి కనీసం ఏడు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని కొమురయ్య అధికారులకు తెలిపారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని తెలిపారు.




సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన నాగపూర్ణ శ్రీనివాస్

రోడ్ల అభివృద్ధికి కృషి

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో అవసరమైన మేరకు రోడ్లను అభివృద్ధి చేసేందుకు గత రెండు పాలకకమిటీ సమావేశాలలో రూ. 10 కోట్ల నిధులను కేటాయించటం, వాటి పనులను త్వరితగతిన చేపడుతున్నామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మంచిరేవుల గ్రామంలో రూ.50 లక్షల నిధులతో ఒకటి, రూ.10 లక్షల నిధులతో మరొక సీసీ రోడ్ల పనులను ఆమె కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డితో కలిసి ప్రారంభించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు పెరుగుతుండటంతో రోడ్లు, డ్రైనేజీ పనులకు పెద్దపీట వేసి నిధులను వెచ్చిస్తున్నామన్నారు. అన్నీ వార్డులలో ప్రధాన రోడ్లు, డ్రైనేజీ పనులకు ప్రాధాన్యం ఇచ్చి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, నాయకులు డి.లక్ష్మణ్, రవి, శ్రీనివాస్, థామస్, శశిధర్‌రెడ్డి, కిరణ్, ప్రశాంత్‌రెడ్డి, రాజుగౌడ్, జయరాజు, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన వైస్ చైర్మన్ విజయ్‌బాబు

మణికొండ: ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి. విజయ్‌బాబు అన్నారు. బుధవారం ఆశ్రం ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో కోకాపేట వార్డు కార్యాలయం వద్ద చెవి, ముక్కు, గొంతు సంబంధించిన ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ప్రతి ఒక్కరికి అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని డాక్టర్‌ల సలహాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేష్ యాదవ్, డాక్టర్‌లు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పరీక్షలు నిర్వహించుకున్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, మందులను అందిస్తామని ఆశ్రం ఆకృతి సంస్థ ప్రతినిధులు తెలిపారు.

జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షల వెల్లువ



జ్ఞానేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బి.జగన్

శంషాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్ర జ్ఞానేశ్వర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బి.జగన్ ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, శ్రీకాంత్, సిద్ధు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం బోనాలకు ఆలయాలు ముస్తాబు



పోచమ్మ దేవాలయం వద్ద పారిశుద్ధ్య చర్యలు చేపట్టిన మున్సిపాలిటీ అధికారులు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో బోనాల పండగను ఆదివారం నిర్వహించనున్నారు. పట్టణంలోని అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. పోచమ్మబస్తీ, సిద్ధాంతి కట్టమైసమ్మ, మధురానగర్ అమ్మవారి ఆలయాలతో పాటు ఆయా బస్తీలో ఉన్న ఆలయాల వద్ద మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆలయాల వద్ద చేయాల్సిన ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే సంబంధిత వార్డు కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడంతోపాటు సంబంధించిన నిధులు సైతం విడుదల చేశారు.

లింగంపల్లి రైల్వేస్టేషన్ రైళ్ల వివరాలు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – సీఎస్‌ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – కాకినాడ (సోమ, బుధ, శుక్ర), (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – ఇండోర్ (ఆదివారం)

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 80, పచ్చిమిర్చి 70, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 30, బీర 35, వంకాయ 30, గోకర 55, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 190, వెల్లుల్లి 280లుగా ఉన్నాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో గురువారం అంతరాయం ఏర్పడనుందని గచ్చిబౌలి ఏఈ వేణు గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కొమరం భీమ్ పరిధిలోని టీఎన్‌జీవోస్ ఫేజ్–1, ఫేజ్–2 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 12గంటల వరకు..

- జర్నలిస్ట్‌కాలనీ ఫీడర్ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీ, గౌలిదొడ్డి, పద్మశ్రీ గార్డెన్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

27 నుంచి బీకే శివాని ఉపన్యాసాలు

రాయదుర్గం: గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో బ్రహ్మకుమారీస్ సంస్థ గ్లోబల్ స్పీకర్ బీకే శివాని ఈనెల 27, 28వ తేదీలలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. 27వ తేదీన ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు ‘ఇన్నర్ కామ్ అండ్ క్లారిటీ త్రూ మెడిటేషన్’అనే అంశంపై, 11 నుంచి ఒంటిగంట వరకు ‘ప్రాబ్లమ్స్ టు పాసిబిలిటీస్.. పేయిన్ టు పవర్’అనే అంశంపై, సాయంత్రం 6 గంటలకు రాత్రి 8గంటలకు ‘ది పవర్ ఆఫ్ పాజ్’పై ఉపన్యాసం ఉంటుందన్నారు. 28వ తేదీన సాయంత్రం 6నుంచి రాత్రి 8 గంటలకు ‘అవేకనింగ్ టు ది కాల్ ఆఫ్ టైమ్’అనే అంశంపై ఆమె ప్రత్యేక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 15 ఏళ్లు పైబడిన వారికే అవకాశం కల్పిస్తారు. 15 నిమిషాల ముందే కార్యక్రమానికి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 040–23001234లో సంప్రదించాలని వారు కోరారు.

నేడు గోల్కొండ కోటలో 4వ పూజ

గోల్కొండ: నేడు గోల్కొండ కోటలో జగదాంబిక మహంకాళి అమ్మవారికి 4వ బోనం పూజ జరుగుతుందని ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన 4వ బోనం ఏర్పాట్లపై జరుగుతున్న వివరాలను వెల్లడించారు. గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

అమ్మవార్లకు కల్లు సాక, ఒడిబియ్యం సమర్పణ

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరి ఉన్న జగదాంబిక అమ్మవార్ల దర్శనానికి బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పాత నగరానికి చెందిన మాతేశ్వరి ఉమ్మడి ఆలయాల వృత్తిదారుల సంఘం వారు బుధవారం అమ్మవార్లకు కల్లుసాక, ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించారు. సంఘం ప్రతినిధి మల్లేష్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా మాతేశ్వరి అమ్మవార్లకు సేవలు చేస్తున్నామన్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా మాతేశ్వరి ఆలయం తరపున ప్రతి యేటా తాము గోల్కొండ ఎల్లమ్మ తల్లికి కల్లు సాక, ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్, మహేష్‌బాబు, పాండు, లలిత, బీజేపీ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.